ప్రజాశక్తి
ఆదివారం 27 ఏప్రిల్ 2025

వాడీవేడిగా 'నగరపాలక' సమావేశం

-రూ.7.22 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్
-తాగునీటి సమస్యను ప్రస్తావించిన సభ్యులు
-సమస్యల పరిష్కారం కోసం సభ్యుల పట్టు
-మూడు కూడళ్లకు, రెండు ప్రాంతాలకు కొత్త పేర్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరాభివృద్ధే ప్రధాన అజెండాగా నగరపాలక సర్వసభ్య సమావేశం జరిగింది. శనివారం కర్నూలు ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాలులో మేయర్ బివై.రామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు బాబు సమావేశానికి హాజరయ్యారు. ముందుగా జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ముష్కరుల దాడిలో మృతి చెందిన 28 మందికి, ఇటీవల మృతి చెందిన 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్ ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సర్వసభ్య సమావేశానికి తొలిసారి వచ్చిన ఎంపీ బస్తిపాటి నాగరాజుకి వేదికపై సత్కరించారు. అనంతరం మొత్తం 26 తీర్మానాల పై పాలకవర్గ సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. రూ.7.22 కోట్లతో రహదారులు, మురుగు కాలువలు, ఇతరత్రా అభివృద్ధి పచ్చజెండా ఊపారు. సమావేశం ప్రారంభించిన కాసేపటికి కాస్త గందరగోళం ఏర్పడడంతో, మేయర్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించే విధానంపై పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో తాగునీటి సమస్య, విద్యుత్ దీపాలు, మరుగు దొడ్ల మరమ్మతులు, విద్యుత్ శాఖ కొమ్మలను నరికేసి అలాగే వదిలేయడం వంటి సమస్యలపై వాడివేడిగా చర్చ సాగింది. కార్పొరేటర్లు వారి వార్డుల్లోని సమస్యలను లేవనెత్తారు. వాటి పరిష్కారం కోసం డిమాండ్ చేశారు. ఎంపీ మాట్లాడుతూ.. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను మినిట్స్ పెట్టి, వాటి పురోగతి స్థితిగతులను ఆయా సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. నగర పరిధిలో ఎక్కడికైనా నిమిషాల వ్యవధిలో వెళ్ళవచ్చని, అధికారులు సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో వెళ్లాలని, అధికారుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ప్రతిపాదనను రూపొందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఏదైనా పథకాల ద్వారా నిధులు వచ్చేందుకు అవకాశం ఉంటే, అధికారులు తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. కల్లూరు 16 వార్డుల్లో తాగునీటి సమస్య చాలా ఉందని, మెరుగుపరిచేందుకు అధికారులు వీలైనంత మేర చర్యలు తీసుకోవాలన్నారు. గోరుకల్లు నుండి కర్నూలుకు తాగునీటిని తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖంగా ఉన్నారని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు తయారు చేయాలన్నారు. వీధి దీపాలు, మరుగుదొడ్లు మరమ్మతులు వెంటనే చేపట్టాలని, రహదారులు, మురుగు కాలువల నిర్మాణంలో జాప్యం చేయొద్దని సూచించారు. హంద్రీనదిపై పార్కులు, రహదారుల నిర్మాణం చేసేటప్పుడు న్యాయపరమైన చిక్కులు లేకుండా అనుమతులు తీసుకోవాలన్నారు. పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలని, పుష్కార్టులు లేక సంచుల్లో చేత సేకరించడం బాధాకరమన్నారు. పారిశుధ్య సమస్యల పరిష్కారానికి అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోడుమూరు ఎమ్మెల్యే మాట్లా డుతూ.. నగరపాలక సంస్థ పరిధిలోని కోడుమూరు మూడు వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, మామిదాలపాడులో రహదారులు, మురుగు కాలువలు నిర్మాణం చేపట్టాలన్నారు. కెసి కెనాల్‌లో మురుగునీరు ఎక్కువైందని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న సభ్యులు

గందరగోళం మధ్య సభ వాయిదా-తిరిగి ప్రారంభం

టిడిపి సభ్యులు ప్రతిపాదించిన అంశాలు అజెండాలో ఉండటం లేదని గొడ్డిసేపు సభను అడ్డుకున్నారు. వారికి ఇటీవల టిడిపిలో చేరిన పరమేష్ ఆజ్యం పోశాడు. మరింత గందరగోళానికి దారి తీసింది. వైసిపి సభ్యులు పోడియం వద్ద వచ్చి నిరసన తెలిపారు. సభ నిర్వహించాలా వాయిదా వేయాల అని ముందుకెళ్లారు. మాటా మాటా పెరిగి స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఆగ్రహంతో కుర్చీని ఎత్తిపడేశారు. దీంతో పరిస్థితిని గమనించిన మేయర్ సభను వాయిదా వేసి వెళ్లిపోయారు. 10 నిమిషాల తరువాత సభ్యులు ఎవరి కుర్చీలో వారు కూర్చున్నాక మళ్లీ సభ ప్రారంభమైంది.

సభలో నెలకొన్న ఘర్షణ వాతావరణం

ముఖ్యాంశాలు

నగరాభివృద్ధికి ప్రాధాన్యత: సమావేశం ప్రధానంగా నగరాభివృద్ధిపై దృష్టి సారించింది. రహదారులు, మురుగు కాలువలు వంటి అభివృద్ధి పనులకు రూ.7.22 కోట్లు మంజూరు చేశారు.

ప్రజా సమస్యలపై చర్చ: తాగునీరు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్ల మరమ్మతులు వంటి ప్రజల రోజువారీ సమస్యలపై సభ్యులు గట్టిగా నిలదీశారు. ఇది సమస్యల పరిష్కారానికి వారికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది.

కొత్త పేర్లు: మూడు కూడళ్లకు, రెండు ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టడం ఒక ముఖ్యమైన నిర్ణయం. బేకరి కట్టను జనాబ్ అబ్దుల్ సలాం ఖాన్ సాహెబ్ నగర్‌గా, గరీబ్‌నగర్‌ను డాక్టర్ కెఎం ఇస్మాయిల్ హుస్సేన్ నగర్‌గా మార్చడం ఆసక్తికరంగా ఉంది. శ్రీరామ టాకీస్ సర్కిల్‌కు శ్రీ బసవ సర్కిల్‌గా, ఆనంద్ టాకీస్ దగ్గర కిసాన్ ఘాట్‌కు పోయే రోడ్డు సర్కిల్‌కు శ్రీ కనకదాసు సర్కిల్‌గా, ఆదోని-ఉల్చాల వై.జక్షన్ కూడలికి శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ సర్కిల్‌గా నామకరణం చేయాలని తీర్మానించారు.

ప్లాస్టిక్ నిషేధం: 120 మైక్రోన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడం పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న మంచి చర్యగా చెప్పుకోవచ్చు. ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తారు.

హైకోర్టు ఆదేశాలు: కల్లూరు మండలంలోని భూమి వినియోగ మార్పిడికి సంబంధించిన తీర్మానం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు తీసుకోవడం జరిగింది.

ఉద్యోగాలు: ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తూ మరణించిన , అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించడం మానవతా దృక్పథాన్ని చాటుతుంది.

సభ్యులందరూ తమ ప్రాంతాల సమస్యలపై గళం విప్పడం, అధికారులు వాటిని పరిష్కరించడానికి హామీ ఇవ్వడం మంచి పరిణామం.

పదిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్

చదువే జీవితాన్ని నిర్ణయిస్తుంది

- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- పదో తరగతి టాపర్లకు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఒక్కరికి చదువే జీవితాన్ని నిర్ణయిస్తుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ భవనంలో జిల్లా వ్యాప్తంగా పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. అన్ని యాజమాన్యాలలో ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులు హాజరవ్వగా వారందరినీ కలెక్టర్ ఘనంగా సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాలు ఆశాజనకంగా వచ్చాయని తాను భావిస్తున్నానని, జిల్లా వ్యాప్తంగా 375 హిందీ పోస్టులు ఖాళీ ఉన్నా. జిల్లా వ్యాప్తంగా వలసలు ఉన్నా. ఈ రెండిటిని అధిగమించి ఫలితాలు రావడం సంతృప్తినిచ్చిందన్నారు. విద్యార్థులు పదవ తరగతి పాస్ అవ్వడం అంటే అకాడమిక్ కెరీర్‌లో ఒక మెట్టని అన్నారు. ప్రతిభ ఒకరి సొత్తు కాదని, మన కృషి, పట్టుదల, మనల్ని విజయతీరాలకు చేరుస్తుందన్నారు. ఈ ఫలితాలు భవిష్యత్తులో 10వ తరగతి రాసే విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందన్నారు. మరింత ఉన్నత ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని అన్నారు. జిల్లాలో రాష్ట్రంలో తొలిసారిగా వర్చువల్ స్టూడియో ఏర్పాటు చేశామని 'నైపుణ్య' పేరుతో అనేక విద్యా సంబంధ కార్యక్రమాలను లైవ్ టెలికాస్ట్ చేస్తూ విద్యార్థులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించే సాంకేతిక సమాచార విప్లవంగా మారనుందని అన్నారు. యుపిఎస్‌సి పరీక్షలకు కోచింగ్ ఇచ్చే అత్యంత బోధన అనుభవం నైపుణ్యం గల వ్యక్తులచే ఉచితంగా శిక్షణ ఇప్పించనున్నామని, ఈ వేసవిలో రెండు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. 8 నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు వారి పాఠ్యాంశాల నైపుణ్యాలే కాకుండా మానసిక స్థిరత్వాన్ని కలిగించే వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ తదితర విషయాలన్నీ 'మనబడి కర్నూలు' యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రసారమవుతుందని అన్నారు. ఇప్పుడొచ్చిన అత్యున్నతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులనే కాకుండా ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులను అన్ని యాజమాన్యాల వారిని పేరుపేరునా అభినందిస్తున్నానని అన్నారు. డిఇఒ శ్యామ్యూల్ పాల్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు రాదని పిల్లలు నిరూపించారని అనేక కష్టాలు ఎదుర్కొని పరీక్షల్లో విజయం సాధించారని అన్నారు. పదవ తరగతి జీవితాన్ని మార్చేస్తుందని ఎవరికైనా మలుపు అన్నది పదో తరగతితోనే ఆరంభమవుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

ఆయా యాజమాన్యాల వారిగా టాపర్స్

ప్రభుత్వ యాజమాన్యంలో గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ బి.క్యాంపు పాఠశాలకు చెందిన 586 మార్కులు, జిల్లాపరిషత్ యాజమాన్యంలో జడ్పి హెచ్ఎస్ వీవర్స్ కాలనీకి చెందిన ఎం. ప్రేమ్ కుమార్ 588 మార్కులు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎపిజె అబ్దుల్ కలాం ఉన్నత పాఠశాలకు చెందిన టి.సాయి లిఖిత 595 మార్కులు, ప్రైవేటు యాజమాన్యంలో 597 మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులు షేక్ మొహమ్మద్ నారాయణ ఎమ్మిగనూర్, కీర్తన నారాయణ ఎల్కూర్ ఎస్టేట్, టి గాయత్రి కేశవరెడ్డి పాఠశాల వికర్ కాలనీ, గీతిక శ్రీ చైతన్య శ్రీనగర్ కాలనీ, సలీమా రూట్ గ్లోబల్ హైస్కూల్ ఆదోని, గోవింద నందు అక్షర శ్రీ ఆదోని, హరిణి భాష్యం ఆదోని, ఎపి మోడల్ స్కూల్ కోడుమూరుకు చెందిన జి సోహెల్ 583 మార్కులు, బిసి వెల్ఫేర్ యాజమాన్యానికి చెందిన వెల్దుర్తి ఎంజెపిహెచ్ఎస్ హాస్య 592 మార్కులు, కెజిబివి పంచలింగాలకు చెందిన వై.దేవిక 576 మార్కులు, ఎపిఆర్ఎస్ పంచలింగాలకు చెందిన శ్రీనిత్య 592 మార్కులు, ఎపిఎస్ డబ్ల్యూ ఆర్ బి.క్యాంప్ చెందిన ఎం ప్రమీల 587 మార్కులు, ట్రైబల్ వెల్ఫేర్ ఆలూర్‌కు చెందిన పి.అంజలి 564 మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్, డిఇఒ తదితర జిల్లా అధికారులు శాలువా మెమెంటో కిరీటంతో ఘనంగా సత్కరించారు.

సమయం లేని 'పరీక్ష'

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తొలి సంతకం చేశారు. ఆ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన పది నెలల తరువాత మెగా డిఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎట్టకేలకు నోటిఫికేషన్ వచ్చిందని అభ్యర్థులు సంతోషిస్తున్నా పరీక్షకు సమయం లేదని ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలోని 2,678 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఏడేళ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభంలో వదిలిన డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 1,543 పోస్టులు కేటాయించారు. టిడిపి ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. డిఎస్సీ అనగానే రెండవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్న అన్ని పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. చాలా ఎక్కువ సిలబస్‌తో కూడుకున్నదని, ఎంత బాగా చదివిన వారైనా ఒక్కసారైనా పూర్తిస్థాయిలో రివిజన్ చేయాలి అంటే కనీసం 60 నుండి 90 రోజులు సమయం పడుతుంది. ప్రభుత్వం పది నెలల నుండి నానబెట్టి కనీసం ప్రిఫర్ అయ్యే సమయాన్ని ఇవ్వకుండా పరీక్ష నిర్వహించడం ఎంతవరకు సమంజసమని పలు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. 2018 డిఎస్సీ పరీక్షలో బాగా చదివిన వారికి కాకుండా కేవలం రెండు రోజులు పరీక్ష రాసిన వారికి మాత్రమే 80 శాతం ఉద్యోగాలు వచ్చాయని, దీనికి ప్రధానమైన కారణం డిఎస్సీ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించి నార్మలైజేషన్ చేయడమే అని చెబుతున్నారు. అభ్యర్థులకు ఎవరికి అన్యాయం జరగకుండా ఉండాలంటే డిఎస్సీ జిల్లా యూనిట్‌గా జరుగుతున్నందున ప్రతి జిల్లాకు ఒక రోజును కేటాయించి జిల్లాలోని అభ్యర్థులందరూ ఒకే పరీక్ష పేపర్ రాసే లాగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

మెరిసిన బాలికలు : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. నంద్యాల జిల్లా 17వ స్థానాన్ని, కర్నూలు జిల్లా 25వ స్థానాన్ని దక్కించుకున్నాయి. కర్నూలు జిల్లాలో 31,185 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 20,584 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 66.01 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 16,326 మంది బాలురు పరీక్ష రాయగా 9,854 మంది ఉత్తీర్ణులయ్యారు. 14,859 మంది బాలికలు పరీక్ష రాయగా 10,730 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులైన వారిలో 14,291 మంది మొదటి డివిజన్‌లో, 3,904 మంది రెండో డివిజన్‌లో, 2,389 మంది మూడో డివిజన్‌లో ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల జిల్లాలో బాలురు, బాలికలు కలిపి 24,496 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 20,051 మంది విద్యార్థులు పాసై 81.85 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 12,702 మంది పరీక్షలకు హాజరు కాగా 10,097మంది పాసై 79.49 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 11,794 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 9,954 మంది పాసై 84.40 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాయలసీమలోని 8 జిల్లాలతో పోల్చితే నంద్యాల జిల్లా పరీక్షా ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచింది. గత ఏడాది ఫలితాలతో పొచ్చితే ఈ ఏడాది 4 శాతం ఉత్తీర్ణత తగ్గింది. గత సంవత్సరం 85.62 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 81.85 శాతంతో సరిపెట్టుకుంది.

అధ్వాన్నంగా రహదారులు : కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలు కలిపి 3,621.408 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. వాటిలో 3,248 కిలో మీటర్ల బిటి రోడ్లు, 258.13 కిలోమీటర్ల సిసి రోడ్లు, 7.7 కిలోమీటర్ల మెటల్ రోడ్లు, 107.05 కిలో మీటర్ల అన్ మెటల్ రోడ్లు ఉన్నాయి. గతేడాది అధిక వర్షాల వల్ల సగానికి పైగా రోడ్లన్నీ రాళ్లు తేలడం, బురదమయంగా మారడంతో ఆయాదారుల గుండా ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. తరచూ పాడయిన రోడ్లల్లో ప్రయాణించడం వల్ల వాహనదారులు వెన్ను, మెడ సంబంధ రోగాల బారిన పడుతున్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లే లక్ష్యమని పాలకులు ఊదరగొట్టినా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలోని పలు గ్రామాల రోడ్లు ఇప్పటికీ గుంతలతోనే దర్శనమిస్తున్నాయి.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని సూర్యనారాయణ భవన్‌లో సిపిఎం న్యూ సిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్లు మాకొద్దు- కరెంటు చార్జీలను తగ్గించాలి అనే నినాదంతో ఉన్న స్టిక్కర్లను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, నగర కార్యదర్శి టి.రాముడు, నగర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు. కె.అరుణ. కె.ప్రభాకర్, నగర కమిటీ సభ్యులు వై.నగేష్, ఎస్.శ్యామల, జి. ఏసు. ఎస్. మొహమ్మద్ రఫీ, వి.శంకర్, జెఎండి.ఉస్మాన్. ఎస్. హుస్సేన్‌బాషా, జె.శ్రీనివాసులు స్టిక్కర్లను విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తేస్మార్ట్ మీటర్లు పెట్టమని ప్రజలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిగత ప్రభుత్వానికన్నా వేగంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత కరెంటు బిల్లులు గతంలో వచ్చిన బిల్లు కన్నా రెండింతలు మూడింతలు అధికంగా వస్తున్నాయని అన్నారు. ఒకపక్క కరెంటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు ప్రజల పైన వేసి ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్ పెట్టేందుకు రంగం సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వ విధానాలు వెనక్కి తీసుకోవాలని సిపిఎంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు అనే ఉద్యమంలో ప్రజలు భాగస్వాములై సిపిఎం చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

స్టిక్కర్లను విడుదల చేస్తున్న నాయకులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్, ముస్లిం జెఎసినాయకులు

వక్ఫ్‌చట్ట సవరణను నిరసిస్తూ 28న ప్రదర్శన

ముస్లిం జెఎసి పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఇస్లామియా అరబీ కాలేజ్ గ్రౌండ్ నుండి ఈనెల28న నిర్వహించే భారీ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ముస్లిం జెఎసి రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు విజ్ఞప్తి చేశారు. ముస్లిం పర్సనల్ లా బోర్డ్ పిలుపు మేరకు, జాయింట్ ఆక్షన్ కమిటీ నాయకత్వంలో హిందూ, ముస్లిం, క్రైస్తవులు భాయి భాయి అని నినదీస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెనక్కి తీసుకునే దాకా పోరాటం చేద్దామని నినాదాలు చేస్తూ అందరూ కలిసి పాల్గొనాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో జమాతే ఇస్లామీయా యే హింద్ నాయకులు మునీర్ ఆహమాద్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఏ.సుభాన్, రిటైర్డ్ ప్రిన్సిపల్ నిస్సార్ అహ్మద్ సార్, జెఎసి నాయకులు ఆఫీజ్ సయ్యద్ అల్లాహ్ బకాష్, ఎస్ఎండి షరీఫ్, ఇస్మాయిల్ ఆవాజ్ కమిటీ నగర కోశాధికారి ఇలియాజ్ లు మాట్లాడుతూ బిజెపి నాయకత్వం లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తమ మంద బలాన్ని వినియోగించుకొని వక్ఫ్ చట్టసవరణ చట్టాన్ని తెచ్చిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో కుల, మత, ప్రాంతా భేదాలు లేకుండా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, తూట్లు పొడుస్తూ తీసుకొచ్చిన, ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న సోమవారం ఉదయం 9 గంటలకు కర్నూలు ఇస్లామియా అరబ్బీ కాలేజ్ గ్రౌండ్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ సాగుతుందని దీంట్లో అందరు కూడా తమ తమ బేధాలను పక్కనపెట్టి ప్రజలందరూ ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లపై ఒత్తిడి తీసుకొని రావాలని ఆ రకంగా తమ, ఐక్యతను చాటాలని , ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు కోరారు. ఈ ర్యాలీ లో శాంతియుతంగా, అన్నదమ్ములా కలిసి పాల్గొనాలని, నల్లజండాలతో, జాతీయ జెండాలతో, మాత్రమే ఉంటుందని ఏ రాజకీయ పార్టీల జెండాలు, రాజకీయ నినాదాలు, ఉండవని పూర్తిగా వక్ఫ్‌చట్ట సవరణకు వ్యతిరేకంగా ఈ ర్యాలీ సాగుతుందని తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అస్లాం ,కాజా పాషా, నీ సార్, షా షా వలి, మహమ్మద్ అలీ, ఒకరుద్దీన్,అహ్మద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదరావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎస్‌టియు సీనియర్ నాయకులు ప్రసాద్‌రావు చేసిన సేవలు మరువలేనివని ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ గోకారి, టికె.జనార్ధన్, మౌలాలి, అజాంబెగ్ ,రాష్ట్ర పుర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్నలు అన్నారు. శనివారం నగరంలోని స్థానిక సలాం ఖాన్ భవనంలో ఎస్‌టియు సీనియర్ నాయకులు ప్రసాద్ రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్‌టియు నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

యూట్యూబ్ చూసి ఇంటి దొంగతనం

-ఆరుగురు నిందితుల అరెస్ట్-నిందితుల్లో ఐదుగురు మైనర్లు
-కేసును చేదించిన కర్నూలు మూడో పట్టణ పోలీసులు
-27 తులాల బంగారు, 35 తులాల వెండి స్వాధీనం
-ఎల్ హెచ్ ఎంఎస్ ను వినియోగించుకోవాలి
-ఎస్పి విక్రాంత్ పాటిల్ వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

యూట్యూబ్‌లో వీడియోలను చూసి ఇంటి దొంగతనానికి పాల్పడిన ఘటన కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన కేసు వివరాలను జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కర్నూలు ఆర్‌టిసి డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్ ఇంట్లో ఈనెల 13న జరిగిన దొంగతనం కేసులో నిందితులను పట్టుకొని విచారించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయన్నారు. ఎస్పి వివరాల ప్రకారం...సర్దార్ హుస్సేన్ తన కుటుంబంతో కలిసి ఓ ఫంక్షన్‌కు ఈనెల 13న హైదారాబాద్ కు వెళ్లారు.14న వచ్చి చూస్తే ఇంటిలో దొంగతనం జరిగింది. డిపో మేనేజర్ ఫిర్యాదు మేరకు కర్నూలు త్రీటౌన్ పిఎస్‌లో కేసు నమోదు చేశారు. స్పెస్ డాభాలో పనిచేసే యువకుడు షేక్షావలి, మరో ఐదుగురు బాలురతో కలిసి యూట్యూబ్‌లో చూసిన వీడియో ఆధారంగా తాళాన్ని విరగ్గొట్టి చోరీకి పాల్పడ్డారు. సాంకేతిక ఉపకరణాల సహాయంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి సమాచారం మేరకు కర్నూలుకు చెందిన షేక్షావలి, మురో ఐదుగురు బాలురను నంద్యాల చెక్ పోస్టు దగ్గర ఉన్న కేంద్రీయ విద్యాలయం దగ్గర అదుపులోకి తీసుకుని వారిని సోదాచేశారు. దొంగిలించిన రూ.20 లక్షల విలువ చేసే 27 తులాల బంగారు, 35 తులాల వెండి సొత్తును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నుండి దొంగతనానికి వాడిన రంపం, రాడ్డు, 2 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో దొంగలను పట్టుకున్న కర్నూల్ డిఎస్పి బాబు ప్రసాద్, కర్నూలు మూడవ పట్టణ సిఐలు శేషయ్య, నాగశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ చెన్నయ్య, సుంకన్న, రంగారావు, పోలీసులు నాగరాజు, కిషోర్, నాగేశ్వరరావు, చంద్రబాబు నాయుడు, ఈ నాగరాజు, తిరుమలేశు, పరశురాముడు, వీరబాబులకు కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ రివార్డులు అందజేశారు. ఇళ్ళకు తాళం వేసి ఊళ్ళకు వెళ్ళేటప్పుడు స్థానిక పోలీసు స్టేషన్లలో సమాచారం అందించాలన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉపయోగించుకొని నిఘా పెట్టుకోవాలి. ఇళ్ళ చుట్టూ ముందు రోడ్డు బాగా కనపడేవిధంగా సిసి కెమెరాలు అమర్చుకునేవిధంగా చేయాలని తెలిపారు. కాలనీల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదర్శంగా నిలవాలి
- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సబ్ కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యార్థులు నిరంతరం చదువులో కొత్త నైపుణ్యాలను అభ్యసిస్తూ, వ్యక్తిత్వ వికాసాన్ని సాధిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అభినందించారు. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో డిప్యూటీ డిఇఒ వెంకట రమణా రెడ్డి, ఎంఇఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉత్తమ ఫలితాలు సాధించిన 9 మంది విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి, సబ్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమానం అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థీ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు లక్ష్యాలను గుర్తించుకొని, వాటిని సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. పాఠశాలలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందించిన మద్దతుకు సబ్ కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు దిక్సూచిగా ఉండాలని చెప్పారు. అనంతరం పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఆదోని మండలం ఆరేకల్ గ్రామంలోని మహాత్మ జోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల 76 మంది విద్యార్థులు, ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలోని ఎపిఆర్ఎస్ పాఠశాల 79 మంది విద్యార్థులు ప్రిన్సిపల్స్ జె.యమునాదేవి, పి.సామ్రాజ్యాన్ని సబ్ కలెక్టర్ శాలువాతో సన్మానించారు.

మండల టాపర్‌కు సబ్ కలెక్టర్ అభినందన

విద్యార్థిని అభినందిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - కౌతాళం

పదో తరగతి ఫలితాల్లో కౌతాళం మండల టాపర్‌గా నిలిచిన బదినేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత కన్నడ పాఠశాల విద్యార్థి మహ్మద్ యాసీన్ (566/600)ను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అభినందించారు. శనివారం ఆదోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆదోని డివిజన్‌లో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కౌతాళం మండల టాపర్‌గా నిలిచిన మహ్మద్ యాసీన్‌ను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిప్యూటీ డిఇఒ వెంకట రమణ రెడ్డి, ఆదోని ఎంఇఒ శ్రీనివాసులు అభినందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరనాథరావు, సీనియర్ ఉపాధ్యాయులు శశిధర తెలిపారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమా వేశం తూతూ మంత్రంగా సాగింది. శనివారం ఎంపిపి నూర్ జానిబీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ విజయ లలిత మాట్లాడారు. ప్రతి శాఖలోనూ మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి ప్రణాళికలపై చర్చించాలని సూచించా రు. వైద్యాధికారులు రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ పట్టించుకోవడం లేదని, గజ్జహల్లి పిహెచ్‌సిలో రోగులకు కనీస సౌకర్యం కూడా లేదని గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధి కెంచప్ప మండిపడ్డారు. ఉపాధి, తదితర శాఖల అధికారులు తూతూ మంత్రంగా మాట్లాడారు. ఢణాపురం నుంచి హోళగుందకు రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు సమస్యపై ప్రతిసారీ మండల సమావేశంలో సంబంధిత అధికారులు హాజరుకావాలని బాయ్‌కాట్ చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. అధికారుల్లో మార్పు రాదు. ఈ సమావేశానికి కూడా జిల్లా సమావేశాలు ఉన్నాయంటూ ఆర్‌అండ్‌బి అధికారులు డుమ్మా కొట్టడం బాధాకరమని ఎంపిటిసిలు, సర్పంచులు మండిపడ్డారు.

మాట్లాడుతున్న అధికారులు

ధాన్యం నీళ్ల పాలు

- రైతును వెంటాడుతున్న వర్షాలు
- వర్షాలకు దెబ్బతిన్న వరి పంట
- నష్టపోయిన రైతులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంట సాగు చేసిన రైతులను వర్షాలు వెంటాడుతున్నాయి. వారం, 15 రోజుల్లో వరి పంటను కోసి, వచ్చిన ధాన్యం విక్రయించి, డబ్బులతో వ్యవసాయ అప్పులు కట్టుకొని, ఇంటికి చేరుదామని ఆశ పడిన రైతులకు నిరాశే మిగిలింది. ఏప్రిల్ నెలలో గాలి వాన సృష్టించిన బీభత్సానికి వరి పంట దెబ్బతిని రైతులకు నష్టాలే మిగిలాయి..! చేతిలోని ముద్ద నోటిలో రాకపోయే.. అనే చందంగా చేతికి వచ్చిన పంటలు గాలివానకు నేలవాలి, ధాన్యం తడిసి ముద్దయి, వడగండ్ల వానకు గింజలు రాలిపోయి రైతులకు తీరని నష్టాలు మిగిలాయి.

గాలి వానకు నేలవాలిన వరి పంట

మండలంలోని తుంగభద్ర నది పరివాహక గ్రామాలైన మేలిగనూర్, నదీచాగి, కుంభాలనూర్, కుంభాలనూర్ క్యాంపు, మురళి, గుడికంబాలి, వల్లూరు గ్రామాలతోపాటు తుంగభద్ర దిగువ కాలువ కింద కౌతాళం, కామవరం, ఉరుకుంద, చిరుతపల్లి, ఎరిగేరి, బదినేహాల్, కుంటానహాల్, ఉప్పరహాల్ గ్రామాల పరిధిలో సుమారు 4 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారు. అన్ని గ్రామాల్లో వరి పంట కోత దశలో ఉండగా మెరుపులతో కూడిన గాలివాన కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి. వరి పంట కోసి పొలంలో ధాన్యం నిల్వ చేయగా వర్షంతో వరి పంట ధాన్యం తడిసి ముద్దయింది. మరి కొంతమంది రైతులు కోతకు సిద్ధంగా ఉన్న పంట గాలి వానకు నేలవాలింది. పంటకు గింజలు మొలకెత్తి, కుంటనహాల్ గ్రామంలో కురిసిన భారీ వడగండ్ల వానకు వరి గింజలు రాలిపోయాయి.

తడిసిన వరి ధాన్యం

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి
- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

మండలంలో కురిసిన వర్షాలకు నష్టపోయిన ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. తడిసిన వరి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. కుంటానహాల్ గ్రామంలో వడగండ్ల వానకు వరి పంట పూర్తిగా దెబ్బతినింది. ఎకరాకు 40 బస్తాలు వచ్చే చోట కేవలం 10 బస్తాలు కూడా పంట దిగుబడి రాని పరిస్థితి ఉంది. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి

వరి పంట సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. అరకొరగా వచ్చిన దిగుబడి, తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గాలివాన సృష్టించిన బీభత్సానికి పంట దెబ్బతిని వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు రాక ఆర్థికంగా తీవ్ర నష్టపోయామని వాపోతున్నారు.

నివేదికలు అందిస్తాం
- ఎఒ శేషాద్రి

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నివేదికలు అందిస్తాం. నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం.

భక్తులకు ఎల్ఇడి సేవలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో భక్తులకు (సాంకేతిక పరిజ్ఞానం ద్వారా) ఎల్ఇడి ద్వారా సేవలను అందిస్తున్నామని డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. శనివారం పుణ్యక్షేత్రంలో నలువైపులా భారీ ఎల్ఇడి టివిలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వామివారి భక్తుల కోసం ఈ ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. గర్భగుడిలో నిర్వహిస్తున్న పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు పుణ్యక్షేత్రం లోపల పరిసరాల్లో కూర్చొని భక్తులు వీక్షించవచ్చని తెలిపారు. గతంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యేవారన్నారు. దాతల సహకారంతో దేవాలయంలో నలువైపులా రూ.24 లక్షలతో నాలుగు షెడ్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వామివారి దర్శనంతో పాటు కొద్దిసేపు కూర్చొని దేవాలయంలో జరిగే కార్యక్రమాలు వీక్షించే అవకాశం భక్తులకు కల్పించినట్లు చెప్పారు. దాతల సహకారంతో భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, నాగరాజ్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఇడి టివిలను ఏర్పాటు చేస్తున్న డిప్యూటీ కమిషనర్

చట్టాల రక్షణకు పోరాటాలు
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఆదోని

పోరాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకునేందుకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. శనివారం సిఐటియు కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు తిప్పన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పట్టణ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న మాట్లాడారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలను కార్మిక వర్గం జయప్రదం చేయాలని తెలిపారు. కార్మిక హక్కులపైనా, చట్టాలపైనా దాడి చేస్తున్న కార్పొరేట్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సంఘం ఏదైనా ఐక్య పోరాటాలే సమస్యలకు పరిష్కార మార్గమని తెలిపారు. సిఐటియు నాయకులు రాజు, షేక్షావలీ, నాగరాజు, శ్రీనివాసులు, ఎల్లప్ప, వీరేష్, ఎం.వీరేష్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

పహల్గాం మృతులకు నివాళి

ప్రజాశక్తి - ఆదోని

జమ్మూ కాశ్మీర్‌లోని పహెల్గాం గ్రామంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి వామపక్ష నాయకులు నివాళులర్పించారు. శనివారం పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. నాయకులు లక్ష్మణ్, అజయ్ బాబు, సుదర్శన్, గోపాల్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని కుప్పగల్ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, సిపిఎం మండల నాయకులు శేఖర్, పార్టీ సభ్యులు రమేష్, భీమా, భోజప్ప, రాజు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని తేరు బజార్‌లో క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు, పట్టణ నాయకులు రాముడు, సిపిఎం పట్టణ నాయకులు యు.రమేష్, సిపిఎం కార్యకర్తలు అబ్దుల్లా, ఉస్మాన్ వలి, ఇస్మాయిల్, నాగరాజు, తిమ్మయ్య, రఫీ, వకీల్ పాల్గొన్నారు. టిడిపి కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, తిమ్మప్ప, జయరాం, వెంకటేష్, మల్లికార్జున ఉన్నారు. **ఆస్పరి**లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకప్ప, ఆలూరు ఐటి కో ఆర్డినేటర్ రంజిత్ కుమార్ ఆదేశాల మేరకు ఆస్పరి మండల సీనియర్ నాయకులు సోమశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనసేన మండల ప్రధాన కార్యదర్శులు వీరేష్, హనుమేష్, నాయకులు మహాదేవ, వీరేంద్ర, మహేష్, అంజి, శేఖర్, మనోజ్, ఓబులేసు, హనుమం తు, ధనుంజయ, మునిస్వామి, సురేష్, మహేంద్ర, తిక్కయ్య, ధను పాల్గొన్నారు.

ఆదోనిలో నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

పత్రాలు అందుకుంటున్న సిఐ, ఎస్ఐ

ఉత్తమ సేవకులుగా సిఐ, ఎస్ఐకి అవార్డులు

ప్రజాశక్తి - మంత్రాలయం

విధి నిర్వహణలో బాధ్యతతో సేవలందించిన సిఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్‌లు ఉత్తమ సేవకులుగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. శనివారం కర్నూలు నగరంలోని ఎస్పీ కార్యాలయంలో ఈ అవార్డు లు అందుకున్నారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో సిఐ రామాంజులు, ఎస్ఐ విజయ్ కుమార్ చొరవ చూపి ఛేదించి రికవరీ చేసి శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్పీ అభినందనలతో విధుల పట్ల మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : వైసిపి

సిఐ రవిశంకర్ రెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు

హాలహర్వి మండలం అమ్మతాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు వెంకటేష్ చౌదరిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు వెంకటేష్ ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డిని కోరారు. శనివారం ఆలూరు ప్రభుత్వాస్పత్రిలో వెంకటేష్ చౌదరి మృతదేహాన్ని చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంకటేష్ చౌదరి మంచి కార్యకర్త అని, ఎవరికీ హాని చేయని వ్యక్తి అని, ఆయనను అతి దారుణంగా చంపడం దారుణమని మండి పడ్డారు. నిందితులు ఎంతటివారైనా శిక్షించాల ని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. భాస్కర్ నాయుడు, వీరేష్, బాబు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - ఆలూరు

గాయాలైన అయ్యాలి

మండలంలోని కమ్మరచేడు గ్రామ బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు వివరాల మేరకు... మనేకుర్తి గ్రామానికి చెందిన యు.అయ్యాలి తన కొడుకు సిద్దుతో కలిసి శనివారం టివిఎస్ ఎక్సెల్‌పై ఇంటి సరుకుల కోసం ఆదోనికి బయల్దేరారు. కమ్మరచేడు గ్రామ బస్టాండ్ ఆవరణలో వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని కారుఢీ కొట్టడంతో కిందపడిన అయ్యాలి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఢీ కొట్టిన కారు ఆపకుండా ఆదోని వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. గాయలైన అయ్యాలిని స్థానికులు కమ్మరచేడు పిహెచ్‌సికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు.

ప్రజలను చైతన్యం చేయాలి
- సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్

ప్రజాశక్తి - ఆదోని

సమాజ మనుగడకు దోహదపడే రచనలతో ప్రజలను మరింత చైతన్యం చేయాలని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప కోరారు. శనివారం ఆదోనిలోని యుటిఎఫ్ కార్యాలయంలో సాహితీ స్రవంతి డివిజన్ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా చైతన్యం కోసం సాహిత్య సృజన చేస్తున్న 'సాహితీ స్రవంతి' మరింతగా విస్తరించాలన్నా రు. ఆదోని డివిజన్ అధ్యక్షులుగా డాక్టర్ సక్కిరి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జె.స్వయంప్రభ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు గా ఎం.నాగమణి, సహాధ్యక్షులుగా బత్తిన మహాదేవి, కోశాధికారిగా ఎం.ఓంకార్, సంయుక్త కార్యదర్శిగా జి.రామలక్ష్మి, గౌరవ సలహాదారులుగా ఎం.షేక్షావలీ (విశ్రాంత తహశీల్దార్), సభ్యులుగా సుబ్బన్న, సుధాకర్, మేరీ జాయ్, సువర్ణ జోషి, చిన్న వెంకటేశులు, రాజ శేఖర్, వీరేష్, జంబులింగయ్య, మహేష్‌ను ఎన్నుకున్నారు.

అనారోగ్యంతో టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వడ్డే తిమ్మప్ప (50) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల మేరకు... తిమ్మప్ప గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల నాయకులు ఈదుల దేవర బండ సుభాన్, బడిగింజల రంగన్న, మాలిక్ బాష తెర్నేకల్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు ఈదుల దేవరబండ సుభాన్ మృతుని కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. టిడిపి గ్రామ నాయకులు, మాజీ ఎంపిటిసి నాగేష్, చిన్న రాముడు, మంచాల తిమ్మప్ప పాల్గొన్నారు.

మెడికల్, హెల్త్ ఉద్యోగులకు పనిభారం తగ్గించాలి

- నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆదోని

వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఫీల్డ్ ఉద్యోగులకు పని భారం తగ్గించాలని ఎపి హంస (వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం) ఆదోని తాలూకా అధ్యక్షులు బాబు రాజు కోరారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఎపి హంస తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎపి హంస జిల్లా కార్యదర్శి సయ్యద్ షఫీ, ఉపాధ్యక్షులు సందీప్ త్యాగరాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జి.బాబురాజు అధ్యక్షులుగా, శ్రీరాములు కార్యదర్శిగా, కోశాధికారిగా వాసుదేవ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ ప్రక్రియకు ఎన్నికల అధికారులుగా సందీప్ త్యాగరాజు, నాగన్న వ్యవహరించారు. ఈ ప్రక్రియను ఎపిఎన్‌జిఒ ఆదోని తాలూకా అధ్యక్షులు ఉషారాణి, మంజునాథ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రఫుబాబు మాట్లాడారు. సమస్యలతో సతమతమయ్యే ఉద్యోగులకు అందుబాటులో ఉండి నూతన కార్యవర్గం పని చేయాలన్నారు. ఏదైనా సమస్య ఉన్నప్పుడు వారికి అండగా ఉండాలని తెలిపారు. తాలూకా నూతన

అధ్యక్షులుగా ఎన్నికైన బాబు రాజు

అధ్యక్షులు బాబురాజు మాట్లాడుతూ... వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘటితంగా పోరాడి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. సచివాలయ గ్రామ/వార్డు హెల్త్ సెక్రటరీలను వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోకి తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో మహిళా ఉద్యోగులు వేధింపులు, దౌర్జన్యాలకు గురికాకుండా మనోధైర్యం కలిగేలా అండగా ఉండాలని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీలను భర్తీ చేసి ఇన్‌ఛార్జీ బాధ్యతల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాల, శాలువాతో సన్మానించారు. ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షులు జగదీష్, ట్రెజరర్ నాగన్న గౌడ్, రామకృష్ణ ఉద్యోగులు ఉన్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి
- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేల (మిస్సింగ్ సిటిజన్స్, హౌస్ హోల్డ్ జియో కోఆర్డినేటర్స్, ఎన్‌పిసిఐ లింకప్)ను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ అల్లాబకాష్ సూచించారు. సర్వేను సకాలంలో పూర్తి చేయని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం మండల కార్యాలయంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిప్పగిరి మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కింద ఎంపికైనందున ప్రతి సర్వేనూ అనుకున్న ప్రకారం పూర్తి చేయాలన్నారు. కొంతమంది సచివాలయ అధికారులు అలసత్వంగా ఉండడం మంచిది కాదని, ఇలాగే కొనసాగితే వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేని వారిని గుర్తించి వెంటనే నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో ప్రతి సర్వేనూ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారని, అందరూ అందుకనుగుణంగా సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. సచివాలయ అధికారులు నిర్దేశించిన సమయానికి కార్యాలయానికి చేరుకొని బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు ఎక్కువ శాతం వెళ్లేలా చూడాలని ఏపీవో జుబేర్ అహ్మద్‌కు సూచించారు. ఎంసిఒ వెంకటేశులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

సేవలో ముందుంటాం
- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

సేవా కార్యక్రమాలలో ముందుంటామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. గత కొన్ని నెలలుగా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం కృష్ణమ్మ అక్క సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ ఆదోని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని బల్లెకల్ గ్రామంలో పారిశుధ్య నివారణకు శ్రమదానం చేశారు. ఇప్పటికే మండలంలోని నాగనాథనహళ్లి, బైచిగేరి, కపటి తదితర గ్రామాలతో పాటు ఆదోని తహశీల్దార్ కార్యాలయం, కోర్టు ఆవరణ వద్ద పరిసరాల పరిశుభ్రత కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛభారత్‌తో మండలం లోని కపటి బస్టాండ్ రూపురేఖలు మార్చేశారు. అలాగే నాగనాథనహళ్లి గ్రామంలో శ్రమదానంతో పరిసరాలను పరిశుభ్రం చేశారు. బల్లేకల్ గ్రామంలో తాగునీటి వ్యవస్థ, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని కృష్ణమ్మ తెలిపారు. వడ్డేగేరికి సంబంధించిన 150 ఇళ్లకు తాగునీటి వ్యవస్థ పూర్తిగా లేదని, డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా ఉందని చెప్పారు. బల్లేకల్ సర్పంచి లోకేష్, మాజీ ఎంపిపి మురళీ, సాధిక్ వలీ, బల్లేకల్ బసవరాజ్, రామాంజనేయులు, లక్ష్మీ రెడ్డి, నారాయణరెడ్డి, గోవిందప్ప, రమేష్, గోపాల్, నరసయ్య, గిడ్డయ్య, రామాంజిని, గోవిందు, నారాయణస్వామి, బైచిగేరి ఓంకార్, గణేకల్ మల్లయ్య, ఎల్లప్ప, బంగారు బాబు, సవరప్ప, పెసలబండ పురుషోత్తం, మండగిరి బాబురావు, ఆటో రెడ్డి, జిలాన్, నాగనాథనహళ్లి రవి, కపటి మహాదేవ, వర్మ, జగదీష్, మాంత్రికి వెంకటేష్, మునిస్వామి, ఖాసీం, అశోక్, కుప్పగల్ హనుమంతు, అంజి, తిక్కస్వామి, భోజప్ప, రవి, తిమ్మప్ప, రాఘవరెడ్డి, భరత్, వీరేష్, నాగరాజ్, భాస్కర్, హరి, పెద్దతుంబలం నరసప్ప, రాముడు, గోవిందుడు, రామాంజి, ఎల్లప్ప పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రం చేస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

'కూర్మ' జయంతిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని హాలిగేర గ్రామ సమీపంలో కొలువైన శ్రీకూర్మ నారాయణ స్వామి 12వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ భక్త మండలి ఎజి.నరేష్ కోరారు. శనివారం నల్లగుట్టయ్య కూర్మ క్షేత్రంలో కూర్మ నారా యణ స్వామి జయంతి మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే 7న ఉదయం స్వామి వారికి క్షీరాభిషేకం, చందనాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరి ప్రదక్షిణ లో భాగంగా స్వామివారి పల్లకితో విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, నాగదేవతల పుట్టలకు పూజ, అతి ప్రాచీనమైన రావి వృక్ష పూజలు, శమీ వృక్ష పూజ, అమృత కలశ పూజ, అవధూత హనుమప్ప తాతకు పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దుమ్మ వెం

ఉపాధి పనులను పీడీ ఆకస్మిక

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర మండలంలో పెరవలి అగ్రహారం, ఉపాధి హామీ పనులను పీడీ వెంకటరమణ ఆకస్మికంగా స్థానిక చేశారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కొలతలు ప్రకారం పనులు పూర్తి చేసి దినసరి కూలి రూ. 300 పొందాలన్నారు. గత నెలలో పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల నగదు త్వరలోనే మీ అకౌంట్లో జమ కానున్నాయన్నారు. పంచాయతీలలో ఎస్సి, ఎస్టీ లతోపాటు ఉపాధి కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి పనులకు రావాలన్నారు. ఎండలు ఎక్కువైనందున ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఒ నర్సిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీలావలి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ శంకర్‌శర్మ, డిఇఒ శామ్యూల్‌పాల్

కేశవరెడ్డి విద్యార్థినికి కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదిఫలితాల్లో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష , డిఇఒ సామ్యూల్‌పాల్, అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలకు చెందిన విద్యార్థిని తన్మయి గాయత్రి పది ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు (597) సాధించి జిల్లాకే తలమానికంగా నిలిచిందని కలెక్టర్, డిఇఒ తెలుపుతూ తన్మయి గాయత్రి ని అభినందిస్తూ సన్మానం చేశారు. కేశవరెడ్డి పాఠశాలల ఫౌండర్ చైర్మన్ ఎన్. కేశవరెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించామని, అదే ఆనవాయితీతో ఈ సంవత్సరం కూడా మా పాఠశాల నుండి రాష్ట్రస్థాయిలో 597 మార్కులు సాధించిన తన్మయి గాయత్రిని కలెక్టర్, డిఇఒ అభినందించారన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష , డిఇఒ సామ్యూపాల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే సంవత్సరంలో కూడా అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు మంచి బాటలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో అరుదైన ఆపరేషన్

ఛాతిలో నాలుగు కేజీల కణితి తొలగించిన వైద్యులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా డోన్ మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన దాసరి బేబి అనే ఓ 40 సంవత్సరాల మహిళ ప్రస్తుతం చైతన్య కాలేజీలో స్వీపర్‌గా పనిచేస్తుంది. ఆమెకు భర్త లేడు. కష్టపడి బతుకుతున్న ఆమెకు అకస్మాత్తుగా విపరీతమైన దగ్గు వచ్చి ఊపిరి ఆడేది కాదు. ఆమెను ప్రభుత్వ సర్వజన వైద్యశాల గుండె ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స విభాగానికి తీసుకువచ్చారు. గుండె ఊపిరితిత్తుల విభాగంలో ఆమెకు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయగా ఆమె ఛాతిలో పెద్దగడ్డ ఉన్నట్లు గుర్తించామన్నారు. అది ఎంత పెద్దగా ఉంది అంటే ఎడమవైపు ఛాతినంతా ఆక్రమించి గుండెను కూడా కుడివైపుకు తోసేసింది. రక్తనాళాలను, వాయునాళాన్ని కూడా గట్టిగా ఒత్తేస్తుంది దాని వలన ఆమెకు అనారోగ్య సమస్యలు వచ్చాయని తెలిపారు, ఆమెకు ఎక్స్‌రే, సిటి స్కాను, ఎమ్మారై లాంటి పరీక్షలు చేసి జాగ్రత్తగా ఆపరేషన్ చేయాలని నిర్ణయించాం. కానీ అంత పెద్ద గడ్డను ఎలా తీయగలమో ఏమైనా సమస్య వస్తుందా అని కొంచెం ముందు వెనక ఆలోచించి పేషంట్‌కు ధైర్యం చెప్పి ఆపరేషన్ చేయడానికి పూనుకున్నామన్నారు. ఎందుకంటే ఇది చాలా ఖరీదైన ఆపరేషన్ , ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే స్తోమత ఆమెకు లేదు. ఇది ఎన్టీఆర్ వైద్య సేవలో కూడా కొంత డబ్బుతో చేయవచ్చు అని చికిత్స ప్రారంభించమన్నారు. ఈ నెల 22 న ఈమెకు క్లిష్టమైన ఆపరేషన్ చేసి గడ్డను పూర్తిగా తొలగించామన్నారు. పేషెంట్ కొంచెం రికవరీ కష్టమైనా కానీ బాగా కోలుకొని డిశ్చార్జ్ చేయడానికి రెడీ అయిందని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ అనే ఈ పథకం చాలా మంది పేదలకు ఉపయోగపడుతూ ఉంటుందని అన్నారు. దీనివలన ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూల్ లో ప్రతి నెల 15 మంది దాకా పెద్ద బైపాస్ ఆపరేషన్లు చేయించుకొని సంతోషంగా ఇళ్లకు వెళుతూ ఉంటారని పేర్కొన్నారు. ఆమెకు ఎటువంటి

పేషెంటుతో డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

సమస్య లేకుండా కలకాలం బాగా జీవించాలని మనం కోరుకుందాం.

చంద్రబాబు దిశ నిర్దేశంతో రాష్ట్రాభివృద్ధి

- రాజ్యసభ మాజీ సభ్యులు టి జి వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూల్ కల్చరల్

గత ఐదేళ్ల పాలనలో వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దిశ, నిర్దేశంతో ముందుకు వెళుతుందని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ అన్నారు. గత వారం రోజులుగా టిజివి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వజ్రోత్సవ కార్యక్రమాలు శనివారం శ్రీ వెంకటేశ్వర మహత్యం పద్య నాటకంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన టిజీ వెంకటేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రోజుకు 20 గంటలు కృషి చేస్తున్న పని రాక్షసుడు అన్నారు. ఆయన పని సేవ అంకితభావంతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. తాము యువకునిగా ఉన్నప్పుడు బిజెపిలో ఉన్నానని, దేశాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో పవన్ కళ్యాణ్ చంద్రబాబు బిజెపి కృషితో రాష్ట్రం మరింత ముందుకు వెళుతుందన్నారు. ఎన్టీఆర్ తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు తీయించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. అంతకుముందు వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బివి రెడ్డి మాట్లాడుతూ 1982లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులో నేను ఒకరని అన్నారు. 1988 వరకు పార్టీలో పనిచేసి ప్రస్తుతం ఆధ్యాత్మిక పారిశ్రామిక రంగంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ చంద్రబాబు కృషితో రాష్ట్ర అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. నిర్వాహకులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ గత వారం రోజుల్లో నగరంలోని నూరు మంది కళాకారులకు సత్కారం చేశామన్నారు. వారం రోజులపాటు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

- చివరి రోజు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యులు టి జి వెంకటేష్

చేశామన్నారు. అనంతరం వెంకటేశ్వర మహత్యం నాటకంలోని కళాకారులను టిజి వెంకటేష్‌ను బీవీ రెడ్డి, కేజీ గంగాధర్ రెడ్డి సత్కరించారు. వివి రమణారెడ్డి దర్శకత్వంలో నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

టీజీవి కళాక్షేత్రం ఆధ్వర్యంలో శనివారం నుండి మే 28 వరకు సంగీతం, నత్యం, చిత్రలేఖనం, నాటకం వంటి అంశాల్లో శిక్షణను టీజీ వెంకటేష్ ప్రారంభించారు. నటరాజ చిత్రపటానికి వేసి చిన్నారులను ఆశీర్వదించారు.

బిఎస్ఎన్ఎల్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెలను వినియోగదారుల సేవమాసంగా భావించి, 'కనెక్టింగ్ విత్ కేర్' నినాదంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు బిఎస్ఎన్ఎల్ చర్యలు చేపట్టిందని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని కర్నూలు బిఎస్ఎన్ఎల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డివిజనల్ ఇంజనీర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎన్ దేవచంద్ నాయక్ తెలిపారు. శనివారం కర్నూలు పట్టణంలోని సిక్కాంప్ ఏరియాలో టిటిడి కళ్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్‌ను మరింత చేరువగా చేసే ఉద్దేశంతో కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కస్టమర్ సర్వీస్ క్యాంపులను ఏర్పాటు చేసి ఆ క్యాంపుల ద్వారా ప్రజల నుండి వచ్చే సూచనలు, సలహాలు తీసుకుంటూ, కస్టమర్ల ప్రాబ్లమ్స్‌ను పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సర్వీస్ క్యాంపులు ఏర్పాటు చేసినప్పుడే కాకుండా www. cfp. bsnl. co.in ద్వారా ఆన్‌లైన్‌లో తమ ఫిర్యాదులు చేయవచ్చని అన్నారు.

సేల్స్ అండ్ మార్కెటింగ్ డివిజనల్ ఎజిఎం ఎన్ దేవచంద్ నాయక్

ఎఫ్‌టిటి హెచ్ సర్వీసులో కొత్త ఆఫర్లు: బిఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ ఇంటర్నెట్ సర్వీస్ లో అద్భుతమైన స్పెషల్ డిస్కౌంట్లను ప్రవేశపెట్టారు. ఫైబర్ బేసిక్ నియో 449 ప్లాన్ , ఫైబర్ బేసిక్ 499 ప్లాన్ తీసుకున్న వారికి మొదటి నెలలో ఉచితంగా సర్వీసులను పొందిన తర్వాత మూడు నెలల వరకు రూ.50 , రూ. 100 డిస్కౌంట్ పొందవచ్చని తెలిపారు.

బిఎస్ఎన్ఎల్ ఐఎఫ్ టీవీ సర్వీసు ద్వారా

ఇంటర్నెట్ తో పాటు టివి ఛానల్లు : బిఎస్ఎన్ఎల్ ఎఫ్‌టిటిహెచ్ సర్వీసు ద్వారా టీవీ ఛానల్లను వీక్షించడానికి వీలుగా బిఎస్ఎన్ఎల్ ఐఎఫ్‌టివి సర్వీసును ప్రవేశపెట్టిందని తెలిపారు . కస్టమర్లు www.fms.bsnl.in iptvreg ద్వారా రిజిస్టర్ చేసుకుని మొబైల్ లో బ్సీన్ఎల్ ఎఐఅఐ ఆప్ , ఆండ్రాయిడ్ స్మార్ట్ టీవీలో వుల్కా లైట్ (బ్సీన్ఎల్ జ) యాప్ ల ద్వారా టీవీ ఛానల్‌ను వీక్షించమని తెలిపారు. ఎజిఎం అర్జున్ కర్నూలు వి శ్రీను నాయక్ , ఎస్‌డిఇలు పి బాలాజీ రెడ్డి , టి వెంకటేశ్వర్లు ,పి. మహమ్మద్ హుస్సేన్ , టిఐపిలు వెంకటేశ్వర్లు , మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొలం వివాదం పై విచారణ

శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్, ఆర్‌డిఒ హాజరు

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో రైతు సోడా మద్ధిలేటి కి చెందిన ఐదు ఎకరాల పొలం వివాదానికి సంబంధించి శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్ విచారణ చేపట్టారు. అనంతరం వెల్దుర్తిలోని స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో రికార్డులను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఐ పాయింట్ కొరకు వెల్దుర్తి, నార్లాపురం గ్రామంలో స్థల పరిశీలన చేశారు. వీరితో పాటు వెల్దుర్తి తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ, డిప్యూటీ తాహశీల్దార్ గురుస్వామిరెడ్డి, ఆర్ఐ మంజుల, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేవ ఆధ్వర్యంలో మానవహారం

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో కోడుమూరు నియోజకవర్గం కోడుమూరు పట్టణంలో 'మానవహారం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆకెపోగు రాంబాబు ఆధ్వర్యంలో జరిగింది. జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన దుర్మార్గమైన ఉగ్రవాద దాడిలో మృతి చెందిన భారత పౌరులకు సంతాపం తెలపాలని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మూడవ రోజు శుక్రవారం రాత్రి కోడుమూరు శ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ కూడలి దగ్గర మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మౌలాలి , వెంకటరాముడు, కృష్ణ, ప్రకాష్ , నాగరాజు, సోమేశ్ ,ఎలప్ప, విజయ్, బాలు, వినయ్ ఆచారి, విజయ రాజు, ప్రవీణ్ , మురళి తదితరులు పాల్గొన్నారు.